క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలగడమే కాకుండా శరీరం దృఢంగా తయారవుతుందని, ఆరోగ్యంగా ఉంటారని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రాత్రి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. యువకులు చదువుతోపాటు ఆటలు ఆడాలన్నారు. ఓడిన వారు నిరుత్సాహపడవద్దని, మరోసారి గెలుపొందేందుకు కృషిచేయాలని సూచించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ఎంపీపీ నర్సింలు, మాజీ సర్పంచ్ సంజీవులు, ఎస్ఎంసీ అధ్యక్షుడు సతీష్, గ్రామపెద్దలు శ్యాంరావు, జగదీష్, దాసికిషన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం చిట్యాల, సంతాయిపేట్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు లక్ష్మణచారి, శివాజీ, శ్యాంరావు, సంజీవులు, నారాయణ, విఠల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మత్తడి పోచమ్మ ఆలయానికి రూ.10 లక్షల విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సంఘ సేవకుడు మోహిన్ అహ్మద్ ఖాద్రి గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదిని ఆలయ కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.3 లక్షలు



భిక్కనూరు: పాల్వంచ మండలం ఇసాయిపేటలో నిర్మిస్తున్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు రూ.3 లక్షల విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ మేరకు గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించారు. గ్రామస్తులు కడెం లక్ష్మీనారాయణ, భూపతిరెడ్డి, ముత్యాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడ: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు డిమాండ్ చేశారు. గురువారం బాన్సువాడలో ఆయన కార్మికులతో మాట్లాడారు. 2024 ఆగస్టు, సెప్టెంబర్ నెలలో లేబర్ కార్డులు, డెలివరీ, మ్యారేజ్, డెత్ తదితర క్లెయిమ్‌లను మీ–సేవలో ఎంట్రీ చేసిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలస్యం అయ్యాయని అన్నారు. అధికారులు చర్యలు తీసుకొని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ డివిజన్ నాయకులు శంకర్, రాములు, శ్రీనివాస్, సామేల్, సురేష్, లక్ష్మి, సాయవ్వ తదితరులున్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. బాన్సువాడ, బాన్సువాడ గ్రామీణం, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఆధార్’ అగచాట్లు ఇంకెన్నాళ్లు?

- ఆధార్ కేంద్రం లేక ఇబ్బంది పడుతున్న రాజంపేట మండలవాసులు
- షెడ్డుకే పరిమితం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఆధార్ కేంద్రం కోసం తహసీల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన షెడ్డు

రాజంపేట: మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పంట విక్రయాలు, సర్టిఫికెట్లు తదితర వాటికి ఆధార్ కార్డు తప్పనిసరి. అదే విధంగా ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుంది. రాజంపేటలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో అర్జీదారులు జిల్లా కేంద్రం కామారెడ్డికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థికంగా గట్టిగా ఉన్నవారు ఎన్నిసార్లయినా కామారెడ్డికి తిరగగలరు. కానీ రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు ప్రతిసారి జిల్లా కేంద్రానికి తిరగాలంటే వారికి ఆర్థిక భారమే.

రెండేళ్ల క్రితం మంజూరు..

రెండేళ్ల క్రితం రాజంపేట మండల కేంద్రానికి ఆధార్ కేంద్రం మంజూరైంది. దీంతో నిర్వాహకుడు తహసీల్ కార్యాలయ ఆవరణలో సొంత నిధులతో ప్రత్యేకంగా షెడ్డు వేసి ఆధార్ కేంద్రం కోసం ప్రయత్నాలు చేపట్టాడు. కానీ ఆధార్ కేంద్రంకు సంబంధించిన యూఐడీఏఐ సంస్థ విధించిన నూతన షరతులు, నిబంధనల కారణంగా ఆధార్ కేంద్రం ఏర్పాటుకు అడ్డంకిగా మారింది. దీంతో ఆధార్ కేంద్రం ప్రారంభం కాలేదు. దీంతో అర్జీదారులు ఆధార్ కార్డుకు సంబంధించిన పనుల కోసం కామారెడ్డికి వెళ్తున్నారు. రాజంపేట మండలంలో ఆధార్ కేంద్రం ఏర్పాటుపై ఇటు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అర్జీదారులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని అర్జీదారులు కోరుతున్నారు.

త్వరగా ఏర్పాటయ్యేలా చూడాలి



మండలంలో ఆధార్ కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆధార్ కేంద్రం ఉంటే చాలా మంది ఇతర గ్రామాల నుంచి సైతం మండల కేంద్రానికి వస్తారు. ఇటీవల ఆధార్‌లో సవరణ కోసం వస్తే ఇక్కడ ఆధార్ కేంద్రం లేదని తెలిసి కామారెడ్డికి వెళ్లాను. అధికారులు ఆధార్ కేంద్రం ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలి.

– నరేందర్, అర్గొండ

బడి బయట పిల్లల గుర్తింపు



మెల్లకుంటతండాలో బడి బయట పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీలు రాజయ్య, కృష్ణస్వామి



మాగిలో బడిబయట బాలికను గుర్తించిన సీఆర్పీ శ్రీధర్



శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో బడిబయట పిల్లలను గుర్తించిన సీఆర్పీ

నాగిరెడ్డిపేట/నిజాంసాగర్/లింగంపేట: జిల్లాలో పలుచోట్ల చదువు మధ్యలో ఆపేసి పనులకు వెళ్తున్న చిన్న పిల్లలను గురువారం సీఆర్పీలు గుర్తించారు. వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. చదువుకుంటే ప్రయోజకులవుతారని, చిన్న వయసులో పిల్లలకు పెద్ద పెద్ద పనులు చేయించవద్దని, చదివించాలని సూచించారు. పిల్లలను పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించారు. నాగిరెడ్డిపేట మండలం మెల్లకుంటతండాలో ఒకరిని, నిజాంసాగర్ మండలం మాగిలో మరొకరిని, లింగంపేటలో ఇంకొందరిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మద్నూర్(జుక్కల్): ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మాట ప్రకారం నిజామాబాద్‌లో రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేశారని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలతో అభిషేకం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతుందని పార్టీ అధ్యక్షుడు తుకారాం అన్నారు. నాయకులు అజయ్, బాల్ కిషన్, యాదవ్‌రావ్, సుభాష్, నాగ్‌నాథ్, కృష్ణ, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే



శాబ్దిపూర్‌లో రైతు భరోసా సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ జనార్దన్



లింగంపేటలో.. ఆర్డీవో ప్రభాకర్



బూర్గుల్‌లో ..మండల ప్రత్యేక అధికారి శ్రీపతి



పిట్లంలో..



గాంధారిలో.. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న



జుక్కల్‌లో.. ఎంపీడీవో శ్రీనివాస్



లింగాయిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో హెప్సీబారాణి



రాజంపేటలో.. ఎంపీడీవో రఘురాం



చిన్న రాంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో సత్యనారాయణరెడ్డి

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా వ్యాప్తంగా గురువారం సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో కలిసి ఆశావహుల ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. సర్వే ఎలా సాగుతుందోనని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



లింగంపేటలో వివరాలు సేకరిస్తున్న అధికారులు



మద్నూర్‌లో..



మిర్జాపూర్‌లో.. ప్రత్యేక అధికారి దయానంద్



బీబీపేటలో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

సంక్షిప్తం

అమ్మఒడిని సద్వినియోగం చేసుకోవాలి



మాచారెడ్డి: గర్భిణులు అమ్మఒడిని సద్వినియోగం చేసుకోవాలని మాచారెడ్డి ప్రభుత్వాస్పత్రి వైద్యుడు ఆదర్శ సూచించారు. గురువారం ఆయన మాచారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ సుశీల, సూపర్‌వైజర్ గీత ఉన్నారు.

జోరందుకున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. బుధవారం నాటికి 2లక్షల 18వేల 611 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సర్వే సక్రమంగా చేపట్టాలి



భిక్కనూరు: కొత్త రేషన్ కార్డుల సర్వేను సక్రమంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రజిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. భిక్కనూరు ఈవో మహేష్‌గౌడ్, సిబ్బంది చిన్న భూషణం తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా స్వామి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గురువారం మండల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదులాయ స్వామి, గౌరవాధ్యక్షుడిగా ఆకుల నర్సింలు, ఉపాధ్యక్షులుగా శివదినం, దొడ్లె రాజు, ప్రధానకార్యదర్శిగా ఆకుల సాయిలు, సహాయకార్యదర్శులుగా తోట రవి, పబ్బ సంజీవులు, కోశాధికారిగా మిద్దెల గంగారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నరేందర్, భాస్కర్, లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లిలో గురువారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు. రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్, మఠం మల్లయ్య, లక్ష్మీనారాయణ, నగేష్, యూత్ అధ్యక్షుడు రాజు, శివలాల్, శంకర్, బాలయ్య, అల్లూరి పాల్గొన్నారు.

తారు పోయింది.. మట్టి మిగిలింది



తారు పోయి మట్టి రోడ్డుగా మారిన తుక్కోజీవాడి–తిమ్మోజీవాడి బీటీ రోడ్డు



గుంతలతో దర్శనమిస్తున్న బాన్సువాడ–గాంధారి రోడ్డు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి నుంచి తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి గ్రామాల మీదుగా వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. తారు పోయి మట్టి రోడ్డుగా మిలిగింది. ఈ రోడ్డుకు బీటీ రెన్యువల్ కోసం నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అలాగే మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా నుంచి బాన్సువాడ వరకు గల ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. భూంపల్లి గ్రామ శివారు నుంచి లింగంపల్లి వరకు ఉన్న ఈ రహదారిపై కొన్ని చోట్ల భారీ గుంతలు, మరికొన్ని చోట్ల చిన్న గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిపై వెళ్లే ప్రయాణికులు నడుములు గుల్ల అవుతున్నాయి. ఈ దారిలో రోజూ ప్రయాణించే వారి పరిస్థితి నరకమే. గుంతలు ఏర్పడినా సంబంధిత శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

కళాశాల తరలింపును విరమించుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద శివారులోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సిద్దిపేట జిల్లా తోర్నాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే తరలింపును విరమించుకోవాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారనే కారణంతో నాగిరెడ్డిపేట నుంచి పాలిటెక్నిక్ కళాశాలను సిద్దిపేట జిల్లాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని డైరెక్టర్‌కు ఆయన వివరించారు. సిద్దిపేట జిల్లాకు తరలించడం వల్ల కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. తగిన చర్యలు చేపట్టాలని డైరెక్టర్‌ను కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన



బిచ్కుంద(జుక్కల్): గోపన్‌పల్లిలో సైబర్ నేరాలపై ప్రజలకు గురువారం ఎస్సై మోహన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అమాయకులను టార్గెట్ చేసి కొందరు సైబర్ నేరగాళ్లు రకరకాల మాటలు చెప్పి మీ బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించి డబ్బులు డ్రా చేసుకుంటారని తెలిపారు. ఫోన్ చేసి అడిగితే ఆధార్‌కార్డు, ఏటీఎం నెంబరు, ఓటీపీ వివరాలు చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు శంక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



కబడ్డీ టోర్నీని వీక్షిస్తున్న ఆర్డీవో ప్రభాకర్



కబడ్డీ ఆడుతున్న యువకులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని కుడుముల సత్యం వెంచర్‌లో గురువారం ఎమ్మెల్యే మదనన్న కబడ్డీ టోర్నమెంటును ఆర్డీవో మన్నె ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. మొదటి విజేతకు రూ.51వేలు, రెండో విజేతకు రూ.21 వేలు, మూడో విజేతకు రూ.11 వేల నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, సామెల్, ఊషాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల కార్యవర్గం ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల మున్నూరుకాపు కార్యవర్గాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుండ బాలకిషన్, గౌరవ అధ్యక్షుడిగా చేపూరి పోశెట్టి, ఉపాధ్యక్షులుగా సుభాష్, పరంధాములు, సహాయ కార్యదర్శులుగా కాంతం, లింగం, పోచయ్య, మండల యూత్ అధ్యక్షుడిగా కొలిమి రాములు, ఉపాధ్యక్షుడిగా గాలెం అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా పోకల మల్లయ్య, తదితరులను ఎన్నుకున్నారు.

మందుబాబులకు అడ్డాగా బస్టాండ్



బాన్సువాడ రూరల్: బోర్లం బస్టాండ్ మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి కాగానే మద్యం, గంజాయి తాగుతున్నారు. మద్యం ఖాళీ సీసాలను పగులగొట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు. అలాగే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లో కాకుండా చెట్ల కింద బస్సుల కోసం వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి గ్రామంలో బెల్ట్‌షాపులను నియంత్రించాలని, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యవసాయేతర భూములను గుర్తించండి



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): క్షేత్రస్థాయిలో పరిశీలించి వ్యవసాయేతర భూములను గుర్తించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత రికార్డుల ఆధారంగా భూములను గుర్తించి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ దశరథ్, మండల వ్యవసాయ అధికారి కిషన్, ఆర్ఐ అంజయ్య, ఏఈవోలు రూప, మాధవి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.